



ఖైరతాబాద్ డివిజన్ బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, హాజరైన పార్టీ నాయకులు

# తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

## కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, అక్టోబర్ 13: అబద్దాల పునాదులపైనే ఆధారపడిన ప్రతిపక్ష పార్టీలు బీఆర్ఎస్ ప్రభుత్వంపై సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఖైరతాబాద్ డివిజన్‌కు చెందిన ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశాన్ని జూబ్లీహిల్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచారం నిర్వహించాల్సిన పద్ధతులపై ఎమ్మెల్యే దానం నాగేందర్ దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని 245 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఓటర్ జాబితాలు సిద్ధంగా ఉన్నాయని, వాటిని బస్తీల వారీగా విభజించుకుని ప్రతి ఓటర్‌ను కలిసి ప్రభుత్వం చేస్తున్న మంచిపనులను గురించి వివరించాలని ఎమ్మెల్యే సూచించారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేవని, పేదల సంక్షేమంలో దేశంలోనే నంబర్‌వన్‌గా తెలంగాణ రాష్ట్రం నిలిచిందనే విషయాన్ని ప్రజలందరికీ వివరించాల్సిన బాధ్యత బీఆర్ఎస్ కార్యకర్తలపై ఉందన్నారు. నియోజకర్గంలో సుమారు 17వేలమందికి ఆసరా పింఛన్లు వస్తున్నాయని, సుమారు 5వేల మంది దాకా కళ్యాణలక్ష్మి,. షాదీ ముబారక్ పథకాలు వచ్చాయన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళలే కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని, తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలు మహిళల కోసమే ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు.

### సమష్టిగా కృషి చేస్తే తిరుగులేని మెజార్టీ..

తెలంగాణ ప్రజలకోసం పదేళ్లలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని, రానున్న 45రోజులు కార్యకర్తలు అలకలు మాని కార్యక్షేత్రంలో దిగాలని సూచించారు. ఒక్కో బూత్‌లో పదిమంది ఔత్సాహిక కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లాలని, చేసిన అభివృద్ధిని, అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి వివరించాలన్నారు. కాలనీలు, అపార్ట్‌మెంట్లలో నివాసం ఉంటున్న వారిని కలిసి తెలంగాణ ఏర్పడిన తర్వాత తీరిన కరెంట్ కష్టాలు. మంచినీటి సమస్యల పరిష్కారం, తగ్గిన ట్రాఫిక్ సమస్యలతో పాటు విశ్వనగరంగా హైదరాబాద్ ఎదిగిన తీరును గురించి వివరిస్తూ ఓట్లను అభ్యర్థించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కే. అరుణ్‌కుమార్, మహేందర్‌బాబు, లక్ష్మణ్‌యాదవ్, లల్లూ, నాగేశ్వర్‌రావు, జ్వాలా ప్రవీణ్, జహంగీర్, కమ్మరి వినయ్, తేజా చౌదరి, త్యాగరాజు, కళ్యాణ్, తాండ్ర మేఘన. నవనీత, పాషా తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబురాలు



ఫిలింనగర్‌లోని ఓ స్కూల్‌లో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చిన విద్యార్థులు ఉత్సాహంగా ఆడిపాడారు.
– బంజారాహిల్స్,అక్టోబర్ 13



ఖైరతాబాద్‌లోని ఓ పాఠశాలలో శుక్రవారం సాయంత్రం విద్యార్థినులు బతుకమ్మ ఆడారు. బతుకమ్మలను ఒక చోట పేర్చి గౌరమ్మ పాటలతో ఉత్సాహంగా గడిపారు.
–ఖైరతాబాద్, అక్టోబర్ 13



అవగాహన: ప్రపంచ కంటిచూపు దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1లోని విరించి ఆస్పత్రిలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరంతో పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని త్రిపుర ప్రభుత్వ చీఫ్ విప్ కళ్యాణ్ రాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యులు వివరించారు. ఆస్పత్రి వైస్ చైర్మన్ వేదుల సత్యనారాయణ, డా. అసద్ సాబేరి, డాక్టర్. నాజియా కౌసర్, డా.అనామికా జోషి తదితరులు పాల్గొన్నారు. – బంజారాహిల్స్,అక్టోబర్ 13:

### ట్రాఫిక్‌కు అంతరాయం
## కలిగిస్తున్న జెనా పబ్
### నిర్వాహకులపై క్రిమినల్ కేసు

బంజారాహిల్స్,అక్టోబర్ 13: సరైన పార్కింగ్ సదుపాయం లేకుండా రోడ్డుపై వాహనాలు పార్క్ చేయించిన పబ్ నిర్వాహకులపై ట్రాఫిక్ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36లోని జెనా బార్ అండ్ కిచెన్ పేరుతో నడుస్తున్న పబ్ వద్ద భారీగా వస్తున్న వాహనాలకు సరిపోయిన పార్కింగ్ సౌకర్యం కల్పించకపోవడంతో రోడ్డుపై కార్లను పార్క్ చేస్తున్నారు. దీనికి తోడు గురువారం రాత్రి అనుమతిలేకుండా పబ్‌లో ఈవెంట్ నిర్వహించారు. దీంతో పెద్ద సంఖ్యలో వచ్చిన వాహనాలన్నింటినీ జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్, 36, 38లపై పార్కింగ్ చేయడం విపరీతంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాదారుల రాకపోకలకు అడ్డంకులు కలిగిస్తున్న జెనా పబ్ నిర్వాహకుడు రాచపూడి వెంకటేష్ కౌశిక్ మీద చర్యలు తీసుకోవాలంటూ ట్రాఫిక్ కానిస్టేబుల్ దిలీప్ ఇచ్చిన ఫిర్యాదుతో ఐపీసీ 341, 188 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 30 నుంచి కార్గిల్ విక్టరీ క్రీడా పోటీలు

హిమాయత్‌నగర్,అక్టోబర్13: వైఎంసీఏ హైదరాబాద్ నారాయణగూడ బ్రాంచి ఆధ్వర్యంలో ఈ నెల 30,31 తేదీల్లో నారాయణగూడలోని వైఎంసీఏ ఆవరణలో 23వ వార్షిక కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ప్రిస్ట్‌లీగైస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు ఉంటాయని,హైస్కూల్ స్థాయి విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చన్నారు. ఈనెల 27సాయంత్రం 5 గంటల లోపు విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.సమాచారం కోసం 703266 0614 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



వెంకటస్వామి నగర్ బస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మహాలక్ష్మిగౌడ్

హిమాయత్‌నగర్,అక్టోబర్13: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా శాఖల ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మిగౌడ్ కోరారు.శుక్రవారం వెంకటస్వామి నగర్ బస్తీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జి.రామన్ గౌడ్,మహేష్,జాకీ,మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జనగణనలో కులగణన చేపట్టాలి




సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్ యాదవ్

ఖైరతాబాద్, అక్టోబర్ 13 : దేశంలో బీసీల లెక్కలు తేలాలంటే జనగణనలో కులగణన చేపట్టాలని అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ అధ్యక్షుడు మహేశ్ యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలను విస్మరిస్తున్నారన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో ఓబీసీ మహిళలకు సమానవాటా కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్స్ రామచంద్ర యాదవ్, వెంగల్ రావు యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి కరాటే కల్యాణి యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్, ఏపీ ప్రధాన కార్యదర్శి నరేందర్ యాదవ్, సలహాదారులు కుమార్ చౌదరి యాదవ్ పాల్గొన్నారు.

## 15నుంచి జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడిలో శరన్నవరాత్రి ఉత్సవాలు

బంజారాహిల్స్,అక్టోబర్ 13: జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మ దేవాలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబర్ 15నుంచి 23వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఈనెల 15న తెల్లవారు జామున 3గంటలకు శ్రీ పెద్దమ్మతల్లికి అభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 15న బాలా త్రిపురసుందరీదేవిగా, 16న శ్రీ గాయత్రీదేవిగా, 17న శ్రీ అన్నపూర్ణాదేవిగా, 18న శ్రీ గజలక్ష్మీదేవిగా, 19న శ్రీ లలితాదేవిగా, 20న శ్రీ సరస్వతి దేవిగా, 21న శ్రీ రాజరాజేశ్వరీదేవిగా, 22న శ్రీ దుర్గాదేవిగా, 23న శ్రీ మహిషాసుర మర్ధిని అవతారంలో శ్రీ పెద్దమ్మ తల్లి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈనెల 16న శ్రీ లలితా సహ్రాసనామ కుంకుమార్చన పూజలు, ఈనెల 23న పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆలయ ఈవో శ్రీనివాసరాజు తెలిపారు.



జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయం